
సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం ∣ 1 ∣ ఫిబ్రవరి ∣ 2024



అందరి ఆట..టైటిల్ వేట!

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' (ఇది అందరి ఆట) మెగా టోర్నమెంట్ తుదిదశకు చేరుకుంది. జిల్లాస్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. - 8లో

జిల్లా అదనపు ఎస్పీగా లోసారి సుధాకర్



రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న లోసారి సుధాకర్‌ను వైఎస్సార్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

జిల్లాలో బుధవారం 18.5 – 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సీజ్ చేసిన నిత్యావసర సరుకుల వేలం

రాయచోటి టౌన్ : అక్రమంగా తరలిస్తున్న సమయంలో సీజ్ చేసిన నిత్యావసర సరుకులు (బియ్యం, ఇతర వస్తువులు) బహిరంగ వేలం వేయడానికి సిద్ధం అయినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ఫిబ్రవరి 3వ తేది మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుందని వివరించారు. ఈ వేలం వేస్తున్న సరుకులు పరిశీలన కార్యాలయ పనిదినములలో (కార్యాలయ పని వేళ్లలో) అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన సరుకులు 67.201 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు పేర్కొన్నారు.

స్కోరర్‌గా రామకృష్ణకు అవకాశం



వాల్మీకిపురం : ఫిబ్రవరి 2 నుంచి 6వరకు విశాఖపట్నంలో జరిగే ఇండియా, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌కి స్కోరర్‌గా వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ సభ్యుడు బి.రామక్రిష్ణ ఎంపిక అయినట్లు వీసీసీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. రామక్రిష్ణ మొదట క్లబ్ క్రీడాకారుడిగా, స్కోరర్‌గా ఉన్నారని, ఏసీఏ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కోరింగ్ పరీక్షలో సెలెక్ట్ అయ్యి 2017 నుండి ఇప్పటి వరకు స్కోరర్‌గా కొనసాగుతున్నాడని పేర్కొన్నారు. ఆరేళ్ల తర్వాత ఇండియా, ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌కి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్యానల్ నుంచి అవకాశం రావడం చాలా సంతోషకంగా ఉందన్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఏసీఏ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, వీసీసీ సభ్యులు షాహిద్, భరత్, రెడ్డి, లాల, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ



రాయచోటి అర్బన్ : రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్‌గా ఆర్.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తుండిన గంగాప్రసాద్ తిరుపతి జిల్లా సూళ్లూరు పేట మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంగళగిరి –తాడేపల్లె కార్పొరేషన్‌లో సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

జాతీయ క్రికెట్ పోటీలకు శివకోటి



నందలూరు(రాజంపేట) : మినీ నేషనల్ డిసేబుల్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు నందలూరు వాసి అలుసూరి శివకోటి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ పోటీలకు తనను ఎంపిక చేయడమే కాకుండా వైస్ కెప్టెన్‌గా నియమించడం పట్ల అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ పట్టణంలో ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు. బౌలింగ్, బ్యాటింగ్‌లలో రాణిస్తానని ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.

రేపు తలనీలాల టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు సమర్పించే తలనీలాలు మరియు ఒక భాగము కొబ్బరి చిప్పల సేకరణకు సంబంధించి శుక్రవారం సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు .సంవత్సర కాలం పాటు తలనీలాలు, కొబ్బరి చిప్పలకు హక్కు పొందాలనుకున్నవారు తగిన ధరావతు చెల్లించి టెండరులో పాల్గొనాలన్నారు. తలనీలాలకు రు.20 లక్షలు, కొబ్బరి చిప్పలకు రు.2లక్షలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు. హెచ్చు పాటదారులకు హక్కులను కల్పిస్తామని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వివరాలు సమర్పించాలి

కడప అగ్రికల్చర్ : గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేటు లిమిటెడ్‌లో గత నెల 19వ తేదీన అగ్ని ప్రమాదం జరగడంతో నిల్వ ఉంచిన పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అగ్నికి ఆహుతి అయ్యాయని కడప సహాయ మార్కెటింగ్ సంచాలకుడు అజాద్‌వలి తెలిపారు. ఇందులో పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకున్న జిల్లా రైతులు తమ వివరాలను సంబంధిత కోల్డ్ స్టోరేజ్ వారు జారీ చేసిన బాండ్, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు లోన్, బీమా(నకలు కాపీ) వివరాలతో దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి లేదా తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శికి స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా వారం రోజులలోపు సమర్పించాలని తెలిపారు. వివరాలకు దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి 9182361223 నంబరులో లేదా తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి 9182361217 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రగతి వైపు అడుగులు!

- మద్యం, సారా తయారీదారుల కుటుంబాలకు ప్రభుత్వం చేయూత
- ప్రజల జీవితాల్లో మార్పు తెస్తున్న సెబ్, డీఆర్‌డీఏ



సారా తయారీదారుల కుటుంబాలకు రుణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గిరీషా (ఫైల్)

పీలేరు: తెలిసో.. తెలియకో అక్రమ మార్గంలో పయనిస్తున్న వారిని గుర్తించి ప్రభుత్వం దారి మళ్లిస్తోంది. ప్రగతి వైపు అడుగులు వేసేలా చేయూతనిస్తోంది. ముఖ్యంగా అక్రమంగా మద్యం, సారా తయారీదారుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించి వారిని ప్రగతిబాటలో నడిపించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కలెక్టర్‌తోపాటు సెబ్ జిల్లా ఇన్‌చార్జి ఆధ్వర్యంలో జిల్లాలో నాటుసారా తయారీకి అలవాటు పడ్డ సుమారు 200 కుటుంబాలను గుర్తించారు. వారికి రుణాలు ఇవ్వడంతో వారి కుటుంబాల జీవనశైలిలో మార్పు వచ్చింది. దీంతో చాలా మంది సారా తయారీ వృత్తికి స్వస్తి పలికారు. కొత్తజీవితంలో అడుగు పెట్టారు. దీంతో గ్రామాల్లో సారా తయారీ, విక్రయం పూర్తిగా తగ్గుముఖం పట్టింది.

జీవనోపాధికి విరివిగా రుణాలు...

నాటుసారాకు అలవాటు పడ్డ కుటుంబాలకు జీవనోపాధి కల్పించడానికి సెబ్, డీఆర్‌డీఏ సంయుక్తంగా కృషి చేశాయి. 2023లో 169 కుటుంబాలకు గొర్రెలు, పాడి ఆవుల ఉత్పత్తులకు రూ.1.49 కోట్లు రుణాలు మంజూరు చేశారు. 9 కుటుంబాలకు ఫుడ్ ప్రాసెసింగ్ చేసేందుకు సోలార్ డిహైడ్రేషన్ పరికరాలు, 7 కుటుంబాలకు వ్యవసాయ ఖర్చులకు రూ. 7.72 లక్షలు, మరో ఏడు కుటుంబాలకు ఆటోరిక్షా కొనుగోలుకు రూ. 7.33 లక్షలు ఆర్థిక చేయూతనిచ్చారు. ఐదు కుటుంబాలకు చిల్లర దుకాణాల ఏర్పాటుకు, మూడు కుటుంబాలకు కుట్టుమిషన్లకు రూ.1.90 లక్షలు మంజూరు చేశారు. మొత్తం 200 కుటుంబాలకు రూ.1.78 కోట్లు ఆర్థిక లబ్ధి చేకూర్చారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

అక్రమ మద్యం, సారా తయారీలో పట్టుబడ్డ నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. విస్తృతంగా తనిఖీలు చేపట్టడం తోపాటు ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేరస్తుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడంతో వారి కుటుంబాల్లో మార్పు తీసుకొచ్చాం.
– రాజ్‌కమల్, జిల్లా సెబ్ ఇన్‌చార్జి

ఆటోతో జీవనం...



గతంలో సారా తయారీ చేసుకుని జీవనం సాగించేవాళ్లం. మా గ్రామంలో సెబ్ అధికారులు మాకు అవగాహన కల్పించి మంచి జీవితంగా గడిపేందుకు రుణాలు ఇస్తామని మారాలని సూచించారు. ఆటో రిక్షా కొనుగోలుకు రూ. 60 వేలు సబ్సిడీతో రూ. లక్ష రుణం మంజూరు చేశారు. దీంతో ఆటో కొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.
– కిషోర్, మద్దిమాకులపల్లె తాండా, పీలేరు మండలం

కేసుల బాధ తప్పింది...



సారా తయారీ చేసి విక్రయిస్తుండడంతో పలు మార్లు కేసులు నమోదు చేసేవారు. సమాజంలో సరైన గౌరవం కూడా ఉండేది కాదు. మాకు ఆవులు కొనగోలు చేసుకోవడానికి రూ. లక్ష రుణం మంజూరు చేశారు. ఆవులు మేపుకుంటూ పాలతో వచ్చే ఆదాయంతో గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్నాం. సారాకు పూర్తిగా స్వస్తి పలికాం.
– శంకర్‌నాయక్, గూడరేవుపల్లె, పీలేరు మండలం

సుపరిపాలన అందించడమే లక్ష్యం

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ అనంతరం అభిషిక్త్ కిషోర్

రాయచోటి : అన్నమయ్య జిల్లా ప్రజలకు సుపరిపాలనను అందించడమే లక్ష్యంగా పని చేస్తామని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.అభిషిక్త్ కిషోర్ అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే తమ లక్ష్యమన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ట్రైబల్ ఏరియా అధికారిగా, జేసీ, మున్సిపల్ నగర్ పాలక కమిషనర్, స్టేట్ ఫైనాన్స్ శాఖలలో పనిచేసిన అనుభవం ఇక్కడ దోహదపడుతుందన్నారు. వెనుకబడిన ప్రాంతమైన అన్నమయ్య జిల్లాను అందరి సహకారంతో అభివృద్ధి వైపు అడుగులు వేయిస్తానన్నారు.

సాదర స్వాగతం...

బాధ్యతలు చేపట్టడానికి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న నూతన కలెక్టర్‌కు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలతో అభినందించారు.



జిల్లాలో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని, నిర్వహణలో చిన్నపాటి తప్పు చేసినా చేయాల్సిన పని చేయకపోయినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు–2024పై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారులు వారికి అప్పగించిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని సూచించారు. జిల్లా పరిధిలోని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

'ఎంఎల్‌హెచ్‌పీ'ల నియామక ప్రక్రియలో మార్పు

- 2న ఫైనల్ మెరిట్ జాబితా విడుదల
- 5న నియామకాల కౌన్సెలింగ్

కడప రూరల్ : 'ఎంఎల్‌హెచ్‌పీ'ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నియామకాల ప్రక్రియలో మార్పులు జరిగాయి. ఆ మేరకు ఫైనల్ మెరిట్ లిస్ట్, ప్రావిజనల్ మెరిట్ జాబితాను ఈ నెల 2వ తేదీన విడుదల చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ జాబితాను హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో స్వయంగా అందజేయవచ్చని లేదా ఎంఎల్‌హెచ్‌పీఆర్‌ఈసీటీ అట్ ది రేటాఫ్ జీ మెయిల్.కామ్‌కు ఈ మెయిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు. 3వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఫైనల్‌గా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. 5వ తేదీన నియామకాల కౌన్సెలింగ్‌ను చేపట్టి అభ్యర్థులకు పోస్టింగ్‌లు కల్పిస్తామని తెలిపారు.

వీరి జీవితం...

వడ్డించుకున్న విస్తరి

జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరి కాదంటారు పెద్దలు. శ్రీ పావన ఇండస్ట్రీస్ అధినేత 'విస్తరి'(భోజన ప్లేట్ల) వ్యాపారంతోనే జీవితాన్ని 'విస్తరి'ంచుకుంటున్నారు. మరో 40 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీతోపాటు, జగన్ ప్రభుత్వం తీసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ చర్యలు వీరి వ్యాపారానికి ఊతమిచ్చాయి. ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో ఇతోధికంగా సాయపడుతూ, వ్యాపారంలో రాణించాలనుకునే పలువురు ఔత్సాహిక యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు



ప్రొద్దుటూరులోని శ్రీ పావన ఇండస్ట్రీస్

- పేపర్ ప్లేట్ల తయారీలో 'శ్రీ పావన ఇండస్ట్రీస్'
- ముడిసరుకు సరఫరాతోపాటు ప్లేట్ల తయారీ

కడప కార్పొరేషన్ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ప్రోత్సాహంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(ఏపీఐఐసీ) ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగానే ప్రొద్దుటూరు పట్టణంలోని పొట్టిపాడు రోడ్, బొల్లవరం వద్ద శ్రీ పావన ఇండస్ట్రీస్ ఏర్పాటైంది. 2019లో షెడ్ కన్‌స్ట్రక్షన్‌కు రూ.50 లక్షలు, మెషినరీకి రూ.50 లక్షలు చొప్పున మొత్తం రూ.కోటితో విస్తర్ల(భోజన ప్లేట్ల) తయారీ పరిశ్రమను పోరెడ్డి సందీప్ స్థాపించారు. ఈ పరిశ్రమ అనతి కాలంలోనే అంచెలంచెలుగా ఎదుగుతూ పలువురికి ఉపాధి కల్పిస్తోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన ధైర్యం

పరిశ్రమల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహక చర్యలే తమకు ధైర్యాన్నిచ్చాయని సందీప్ చెప్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 లక్షలు రాయితీ ఇచ్చింది. దీంతోపాటు పరిశ్రమలకు అవసరమైన కరెంట్, నీరు, ఇతర అనుమతులకు సింగిల్ విండో విధానం అమలుతో శ్రమ, కాలయాపన తగ్గింది. ఈ చర్యలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడంతో పేపర్ ప్లేట్లు, కప్పులకు డిమాండ్ పెరిగింది. స్టీల్, ప్లాస్టిక్ ప్లేట్లు అయితే వినియోగించిన ప్రతిసారీ శుభ్రం చేయాలి. లేకుంటే రోగాల బారిన పడే ప్రమాదముంది. మరోవైపు ప్లాస్టిక్ అంత వేగంగా భూమిలో కలిసిపోదు. అదే చేతిలో ఉంచుకొని తినే పేపర్ ప్లేట్లు(బఫే ప్లేట్లు), కూర్చొబెట్టి వడ్డించేవి(సిటింగ్ పేపర్ ప్లేట్లు) తినగానే పడేస్తాం. కడగాల్సిన శ్రమ ఉండదు. ఇవి పేపర్‌తో తయారు చేసినవి కావడంతో భూమిలో త్వరగా కలిసిపోతాయి. ప్రభుత్వ చర్యలతో ఈ తరహా పరిశ్రమలకు ఊతం ఏర్పడింది.

ముడిసరుకు సరఫరా, ప్లేట్ల తయారీ

శ్రీ పావన ఇండస్ట్రీస్‌లో క్రాఫ్ట్ పేపర్ రోల్స్, గమ్, ఫిల్మ్ తెచ్చి కారగేషన్ మిషన్‌లో వాటిని అతికించడం ద్వారా పేపర్ షీట్లు తయారు చేస్తున్నారు. వాటిని పేపర్ ప్లేట్లు తయారుచేసే కుటీర పరిశ్రమలకు ముడి సరుకుగా సరఫరా చేస్తున్నారు. అందులోనే ఆరు మెషీన్ల ద్వారా వీరు కూడా వివిధ రకాల పేపర్ ప్లేట్లు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పరిశ్రమలో 20 మంది స్థానిక మహిళలు, మరో 20 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి పొందుతున్నారు. వీరు తయారు చేసే భోజన ప్లేటు హోల్‌సేల్‌గా రూ.1.50, బహిరంగ మార్కెట్‌లో రూ.2.50కు విక్రయిస్తున్నారు. భారీ స్థాయిలో పేపర్ షీట్లు, ప్లేట్లు తయారు చేయడంతో వీరికి ఆదాయం కూడా బాగానే ఉంటోంది.

నీడ పట్టున ఉంటూనే సంపాదన



పావన ఇండస్ట్రీ ఏర్పాటుకు ముందు ఏ పనీ లేక ఇంటిదగ్గరే ఉండేదాన్ని. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ఇందులో పనిచేస్తూ నెలకు రూ.10 వేలు సంపాదిస్తున్నా. నా కుటుంబ జీవనానికి, పిల్లల చదువులకు, నా ఖర్చులకు ఈ డబ్బు ఎంతగానో ఉపయోగపడుతోంది. నాలాంటి పది మంది మహిళలు ఇక్కడ పనిచేస్తున్నారు. నీడ పట్టునే ఉండి ఈ మాత్రం సంపాదించడం సంతోషమే కదా..!
– భారతి, ప్రొద్దుటూరు

ఉన్న ఊర్లోనే ఉపాధి



ఈ పరిశ్రమలో నేను మేనేజర్‌గా పనిచేస్తున్నాను. నెలకు రూ.15 వేలకు పైగానే సంపాదించుకుంటున్నా. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎవరు ఏ పని చేయాలో చెప్పడం, ముడి సరుకు రప్పించడం, తయారు చేసిన ప్లేట్లను ప్రాంతాల వారీగా సప్లై చేయడం తదితర విషయాలను చూసుకుంటాను. పెద్దగా శారీరక శ్రమ ఉండదు. ఉన్న ఊర్లోనే గౌరవ ప్రదమైన జీతం వస్తోంది.
– శశిధర్, మేనేజర్, ప్రొద్దుటూరు

తహసీల్దార్ల బదిలీ

ఎన్నికల నేపథ్యంలో ఆదేశాలు జారీ చేసిన సీసీఎల్ఏ

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తహసీల్దార్లను బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) జి.సాయిప్రసాద్ బుధవారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. సొంత జిల్లాకు చెందిన వారు, ఒకేచోట మూడేళ్లపాటు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని వేరే ప్రాంతాలకు మార్చారు. జూన్ 30వ తేదీ నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తి కానివారు, రిటైర్‌మెంట్ అయ్యే వారిని బదిలీల నుంచి మినహాయించారు. మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి కాని బ్రహ్మంగారిమఠం మండల తహసీల్దార్ బి.సువర్ధాదేవి, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.జ్ఞానేశ్వరి, రిటైర్‌మెంట్‌కు దగ్గరున్న కలెక్టరేట్ సూపరింటెండెంట్ జి.వెంకటరమణ, హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్ ఎల్.ప్రభాకర్‌రెడ్డి, నందలూరు తహసీల్దార్ వై.సత్యానందం, రాయచోటి ఆర్డీఓ కార్యాలయ ఏఓ వి.వెంకటసుబ్బయ్యలను బదిలీల నుంచి మినహాయించారు. జిల్లాలో మిగిలిన తహసీల్దార్లను నాలుగో జోన్‌లోని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి వైఎస్సార్ జిల్లాకు కేటాయించారు.

వైఎస్సార్ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లు

పేరు	ప్రస్తుత స్థానం
కె.శ్రీధర్	అనంతపురం కలెక్టరేట్
జిలానీ	పుట్టపర్తి (అనంతపురం)
సి.కరుణాకర్	బుక్కపట్నం (అనంతపురం)
జి.సౌజన్యలక్ష్మి	పరిగి (అనంతపురం)
ఎం.వేణుగోపాల్	రొళ్ల (అనంతపురం)
జమాలుల్లాఖాన్	అగలి (అనంతపురం)
పి.శివరాం	నగిరి (చిత్తూరు)
ఎస్ఎస్ కృష్ణకుమార్	కుప్పం (చిత్తూరు)
కె.అమర్‌నాథ్	రొంపిచెర్ల (చిత్తూరు)
ఇ.అమర్‌నాథ్	గంగవరం (చిత్తూరు)
కె.బెన్నురాజ్	బంగారు పాలెం (చిత్తూరు)
ఎం.భగవతి	నింద్ర (చిత్తూరు)
కె.కుప్పయ్య	తిరుపతి (చిత్తూరు)
పి.భారతి	తిరుపతి (చిత్తూరు)
వీఎస్‌వీఆర్ కృష్ణ	డక్కిలి (చిత్తూరు)
ఎం.రోశయ్య	నాయుడుపేట (చిత్తూరు)
ఎస్.శివప్రసాద్	ఏర్పేడు (చిత్తూరు)
యు.మధుసూదన్‌రావు	పిచ్చాటూరు (చిత్తూరు)
ఎస్.ప్రమీల	నారాయణవనం (చిత్తూరు)
కె.వెంకట రమణ	తిరుపతి (చిత్తూరు)
పి.శిరీష	చంద్రగిరి (చిత్తూరు)
కేపీ భాగ్యలక్ష్మి	పాకాల (చిత్తూరు)
ఐ.సుబ్రమణ్యం	వడమాల పేట (చిత్తూరు)
వై.రమేష్‌బాబు	తిరుపతి (చిత్తూరు)
ఆర్.వెంకటలక్షుమ్మ	తిరుపతి (చిత్తూరు)
ఎస్.మహేశ్వరిబాయి	సంబేపల్లె
కె.ధనుంజయులు	పీలేరు (చిత్తూరు)
ఎం.భీమేశ్వరరావు	కురబలకోట (చిత్తూరు)
సి.శ్రీనివాసులు	ములకలచెరువు (చిత్తూరు)
జె.రాము	పెద్దమండెం (చిత్తూరు)
బి.శ్రీనివాసులు	నంద్యాల (కర్నూలు)
డి.రవికుమార్	ఉయ్యాలవాడ (కర్నూలు)
బీవీఎస్ విద్యాసాగర్	డోన్ (కర్నూలు)
వై.నరేంద్రనాథరెడ్డి	బేతంచర్ల (కర్నూలు)
ఎస్.ప్రకాశ్‌బాబు	మిడుతూరు (కర్నూలు)
ఎన్.రవికుమార్	బండి ఆత్మకూరు (కర్నూలు)
జి.ఉమారాణి	ఆత్మకూరు (కర్నూలు)
సి.చంద్రశేఖర్‌వర్మ	కొతాళం (కర్నూలు)
పి.రాజేశ్వరి	కలెక్టరేట్ కర్నూలు
ఐ.విజయశ్రీ	కర్నూలు
వెంకటేశ్‌నాయక్	దేవనకొండ (కర్నూలు)
ఎస్.వెంకట రమణ	పెద్దకడుబూరు (కర్నూలు)
ఇ.వెంకటలక్ష్మి	ఆదోని (కర్నూలు)
టీవీ రమేష్‌బాబు	కలెక్టరేట్ కర్నూలు
ఎ.నిత్యానందరాజులు	కృష్ణగిరి (కర్నూలు)
వి.పుల్లారెడ్డి	ఓబులవారిపల్లె (అన్నమయ్య)

అన్నమయ్య జిల్లాకు ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లు

ఎస్.ఈశ్వరమ్మ	శింగనమల
ఎస్.రమాదేవి	బుక్కరాయసముద్రం
బి.లక్ష్మినాయక్	పెద్దపప్పూరు
ఎస్.మహబూబ్‌బాష	గుత్తి
బి.అనిల్‌కుమార్	వజ్రకరూర్
ఎస్.నాయజ్ అహ్మద్	కంబదూరు
పి.విజయకుమారి	కుందుర్పి
ఎస్.బ్రహ్మయ్య	గుమ్మగట్ట
ఎస్‌పీ శ్రీనివాసులు	బొమ్మనహాళ్
ఆర్.ఇన్‌బనతన్	జీడీ నెల్లూరు
శేషగిరిరావు	పులిచెర్ల
షేక్ జరీన	సత్యవేడు
బి.శ్రీనివాసులు	అవుకు
ఆర్.శివరాముడు	కర్నూలు రూరల్
బి.జయన్న	కోడుమూరు
ఆర్.గోవింద్‌సింగ్	ఆదోని

వైఎస్సార్ జిల్లానుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు

పేరు	పనిచేస్తున్నది	బదిలీ అయిన జిల్లా
కె.విజయ్‌కుమార్	కలెక్టరేట్ ఏఓ, కడప	అనంతపురం
పి.శ్రీనివాసరెడ్డి	కలెక్టరేట్, కడప	చిత్తూరు
టి.వెంకట రమణ	కలెక్టరేట్, కడప	నంద్యాల
ఎస్.బధ్రుజమ	కలెక్టరేట్, కడప	శ్రీ సత్యసాయి
పి.శరత్	కలెక్టరేట్, కడప	తిరుపతి
జి.అక్బర్‌బాష	జమ్మలమడుగు, ఆర్డీఓ ఆఫీసు	శ్రీ సత్యసాయి
టి.ఈశ్వరయ్య	జమ్మలమడుగు, ఆర్డీఓ ఆఫీసు	అనంతపురం
ఎం.వెంకటస్వామి	కడప ఆర్డీఓ ఆఫీసు	శ్రీ సత్యసాయి
ఆర్.శేషారాంసింగ్	కడప ఆర్డీఓ ఆఫీసు	అనంతపురం
ఏవీ రమణమ్మ	బద్వేలు ఆర్డీఓ ఆఫీసు	నంద్యాల
పి.విజయకుమారి	పులివెందుల ఆర్డీఓ ఆఫీసు	నంద్యాల
జీవన్ చంద్రశేఖర్	కడప అర్బన్	నంద్యాల
ఎం.శ్రీవాణి	అట్లూరు	తిరుపతి
జీవీ మధురవాణి	బి.కోడూరు	నంద్యాల
వి.గంగయ్య	పోరుమామిళ్ల	తిరుపతి
జి.రవీంద్రారెడ్డి	కలసపాడు	నంద్యాల
డి.దామోదర్‌రెడ్డి	గోపవరం	నంద్యాల
బి.రామచంద్రుడు	కాశినాయన	నంద్యాల
బి.అనూరాధ	మైదుకూరు	కర్నూలు
ఏఎస్ నజీర్ అహ్మద్	ప్రొద్దుటూరు	నంద్యాల
బి.గురప్ప	జమ్మలమడుగు	నంద్యాల
ఎం.ఇందిరా రాణి	రాజుపాలెం	అనంతపురం
కె.శోభన్‌బాబు	కొండాపురం	అనంతపురం
జి.వెంకటేశ్వర్లు	ముద్దనూరు	అనంతపురం
డి.తిరుపతయ్య	మైలవరం	నంద్యాల
జ్యోతి రత్నకుమారి	పెద్దముడియం	నంద్యాల
పి.రామకుమారి	దువ్వూరు	శ్రీ సత్యసాయి
ఎ.నాగేశ్వరరావు	ఎర్రగుంట్ల	తిరుపతి
కె.మాధవకృష్ణారెడ్డి	పులివెందుల	నంద్యాల
వి.రాజసింహ నరేంద్ర	చక్రాయపేట	తిరుపతి
ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి	వేంపల్లె	చిత్తూరు
ఎం.లక్ష్మినారాయణ	లింగాల	శ్రీ సత్యసాయి
వి.వెంకట సుబ్బయ్య	వేముల	సత్యసాయి
డి.మహబూబ్‌బాష	సింహాద్రిపురం	అన్నమయ్య
ఎం.బాలనరసింహులు	తొండూరు	సత్యసాయి
బి.శివరామిరెడ్డి	కడప	అనంతపురం
అలీఖాన్	చెన్నూరు	తిరుపతి
టి.సరస్వతి	కమలాపురం	శ్రీ సత్యసాయి
డి.ఉదయభాస్కర్‌రాజు	పెండ్లిమర్రి	తిరుపతి
పి.శంకర్‌రావు	వల్లూరు	తిరుపతి
ఎంవీఎస్ నారాయణరెడ్డి	సీకే దిన్నె	తిరుపతి
వై.ఉదయభారతి	ఖాజీపేట	తిరుపతి
ఎంఏ రమేష్	ఒంటిమిట్ట	శ్రీ సత్యసాయి
బి.లక్ష్మిదేవి	సిద్దవటం	తిరుపతి
ఎ.తులశమ్మ	రాజంపేట ఆర్డీఓ ఆఫీసు	నంద్యాల
ఎంవీ సుబ్రమణ్యంరెడ్డి	రాజంపేట	చిత్తూరు
బి.శ్రీధర్‌రావు	పెనగలూరు	తిరుపతి
ఎస్.ఉదయశంకర్‌రాజు	లక్కిరెడ్డిపల్లె	శ్రీ సత్యసాయి
ఎం.దైవాదీనం	గాలివీడు	చిత్తూరు
ఎం.శ్రీరాములు నాయక్	చిన్నమండెం	తిరుపతి

క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి గుర్తు తెలియని వృద్ధురాలు



నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధురాలు

కడప అర్బన్ : కడప నగరం మహావీర్ సర్కిల్‌లో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వృద్ధురాలు నిస్సహాయ స్థితిలో ఉండగా అటు వైపుగా వెళుతున్న యువకులు గమనించి నగర శివార్లలోని వృద్ధాశ్రమానికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఆమె దగ్గరున్న డబ్బును ఎవరో లాక్కెళ్లారని, తలకు గాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన పేరు సుబ్బమ్మ అని, తన ఊరు లక్ష్మీపాలెం అని, రామాలయం పక్కన తన ఇల్లు అని చెబుతోంది. ఆమెను ఇందిరానగర్‌లో పద్మావతి వెంకటేశ్వర ఉచిత వృద్ధాశ్రమంలో కొందరు యువకులు చేర్పించారు.

యువతి ఆత్మహత్య



భార్య విద్యారాణి మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త చంద్రశేఖర్

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యల కారణంగా ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణం టీచర్స్ కాలనీలో బుధవారం జరిగింది. టీచర్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో మాంసం దుకాణం నిర్వహిస్తున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో భార్య విద్యారాణి(38) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరి ఆట.. టైటిల్ వేట!

- 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి పోటీలు ఆరంభం
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు
- రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు



కడప డీఎస్‌ఏ మైదానంలో హోరాహోరీగా సాగుతున్న పోటీలు

కడప స్పోర్ట్స్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' (ఇది అందరి ఆట) మెగా టోర్నమెంట్ తుదిదశకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా 645 సచివాలయాల పరిధిలో ప్రారంభమైన ఈ మ్యాచ్‌లు మండల, నియోజకవర్గస్థాయి దాటుకుని జిల్లాస్థాయి పోటీలకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే నియోజకవర్గస్థాయిలో విజేతలుగా నిలిచిన పురుషులు, మహిళల జట్లు జిల్లాస్థాయికి రావడంతో పటిష్టమైన జట్ల మధ్య రసవత్తరంగా పోటీలు మొదలయ్యాయి. జిల్లాస్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలకు విచ్చేసిన క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ఆటతీరును కనబరచాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమయ్యే క్రీడాసామగ్రి, క్రీడాదుస్తుల విషయంలో డీఎస్‌ఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కాగా డీఎస్‌ఏ మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా, కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో క్రికెట్, పీవీఆర్ స్పోర్ట్స్ ఎరీనాలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి. గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కడప ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శివరామిరెడ్డి, డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఖోఖో పోటీలు..

ఖోఖో పురుషుల విభాగంలో సెమీఫైనల్-1లో కమలాపురం, జమ్మలమడుగు జట్లు తలపడగా కమలాపురం జట్టు విజేతగా నిలిచి ఫైనల్స్‌కు చేరింది. సెమీఫైనల్-2లో ప్రొద్దుటూరు, మైదుకూరు జట్లు తలపడగా మైదుకూరు జట్టు విజేతగా నిలిచి ఫైనల్స్‌కు చేరింది. రేపు కమలాపురం, మైదుకూరు జట్లు ఫైనల్‌మ్యాచ్‌లో తలపడనున్నాయి. మహిళల విభాగంలో సెమీఫైనల్-1లో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు జట్లు తలపడగా జమ్మలమడుగు విజేతగా నిలిచి ఫైనల్స్‌కు చేరింది. సెమీఫైనల్-2లో కమలాపురం, కడప జట్లు తలపడగా కమలాపురం జట్టు ఫైనల్స్‌కు చేరింది.

వాలీబాల్..

వాలీబాల్ పురుషుల విభాగంలో నిర్వహించిన సెమీఫైనల్-1 మ్యాచ్‌లో బద్వేలు, మైదుకూరు తలపడగా మైదుకూరు జట్టు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్-2లో జమ్మలమడుగు, సిద్ధవటం జట్లు తలపడగా సిద్ధవటం విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. మహిళల సెమీఫైనల్-1లో కడప, పులివెందుల జట్లు తలపడగా కడప జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్-2లో మైదుకూరు, ప్రొద్దుటూరు జట్లు తలపడగా మైదుకూరు జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

కబడ్డీ..

కబడ్డీ పురుషుల విభాగం సెమీఫైనల్-1లో కమలాపురం, బద్వేలు జట్లు తలపడగా బద్వేలు జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. కాగా గురువారం సెమీఫైనల్-2లో ప్రొద్దుటూరు, మైదుకూరు జట్లు తలపడనున్నాయి. మహిళల సెమీఫైనల్-1లో మైదుకూరు, కమలాపురం జట్లు తలపడగా మైదుకూరు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్-2లో పులివెందుల, జమ్మలమడుగు జట్లు తలపడగా పులివెందుల విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

క్రికెట్‌లో ఫైనల్‌కు చేరిన ప్రొద్దుటూరు..

కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానాల్లో నిర్వహించిన సెమీఫైనల్-1లో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు జట్లు తలపడగా, ప్రొద్దుటూరు జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. కాగా మరో పూల్‌లో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ల అనంతరం పులివెందుల, కమలాపురం జట్లు సెమీఫైనల్-2లోకి ప్రవేశించాయి.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర' మ్యాచ్‌లు

ఫైనల్‌కు చేరిన జట్లు

కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' మెగా టోర్నమెంట్‌లో భాగంగా జిల్లాస్థాయి పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం ప్రారంభమైన లీగ్ మ్యాచ్‌లు సాయంత్రానికి సెమీఫైనల్ పూర్తి చేసుకున్నాయి. బ్యాడ్మింటన్ పోటీలు పూర్తి కాగా పలు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం కొన్ని క్రీడాంశాల్లో సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

బ్యాడ్మింటన్ చాంపియన్ కడప జట్లు



బ్యాడ్మింటన్ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

బ్యాడ్మింటన్ విభాగంలో పురుషులు, మహిళల విభాగంలో కడప జట్లు విజేతగా నిలిచాయి. పురుషుల విభాగంలో కడప కాగితాలపెంట సచివాలయం క్రీడాకారులు ఖాజా-అబ్దుల్ జోడి విజేతగా నిలిచారు. రన్నరప్‌గా జమ్మలమడుగుకు చెందిన యోగి-సత్యపాల్ నిలువగా, మూడోస్థానంలో ప్రొద్దుటూరుకు చెందిన సాయి-రాయుడు జోడి నిలిచింది. మహిళల విభాగంలో కడప శంకరాపురం సచివాలయ పరిధిలోని వెన్నెల-శ్రీలత జోడి విజేతలుగా నిలిచారు. రన్నరప్‌గా ప్రొద్దుటూరుకు చెందిన ప్రవీణ-జ్యోత్స్న జోడి నిలిచింది. మూడో స్థానంలో జమ్మలమడుగుకు చెందిన నాజనీన్-వాణి జోడి నిలిచింది.

డీసీసీ బ్యాంకులో ఇక రిజిస్ట్రేషన్ చలానా సౌకర్యం

ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



కడప డీసీసీ బ్యాంకులో ఈ- రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకులో ఇక నుంచి రిజిస్ట్రేషన్ చలానా తీసుకోవచ్చని ఈ సౌకర్యాన్ని డీసీసీ బ్యాంకు ఖాతాదారులు మాత్రమే కాకుండా అందరూ ఉపయోగించుకోవచ్చని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు ఛైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకు హెడ్ ఆఫీస్‌లో బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌తో కలిసి ఈ- రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చలానాను కడప డీసీసీ బ్యాంకులో కూడా తీసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు కేవలం స్టేట్ బ్యాంకులో మాత్రమే ఈ సౌకర్యం ఉండేదన్నారు. చలానా మొత్తానికి కట్టాల్సిన దాని కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : భూతగాదాల కారణంగా మండలంలోని మద్దయ్యగారిపల్లికి చెందిన ఎ.వెంకట్రమణ (62) అనే రైతు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దాయాదుల మధ్య తలెత్తిన భూ వివాదాలే ఇందుకు కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తుండటంతో తనకు న్యాయం జరుగుతుందో లేదోనని భయాందోళనకు లోనై ఈ చర్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

దేవగుడి సోదరుల రౌడీయిజానికి భయపడం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పక్కనే కండువాతో శశిధర్‌రెడ్డి

ముద్దనూరు : నియోజకవర్గంలో దేవగుడి సోదరులు చేస్తున్న రౌడీ రాజకీయానికి, ఫ్యాక్షన్‌కు తాను, వైఎస్సార్ సీపీ వర్గీయులు భయపడేది లేదని, ప్రశాంత రాజకీయాలే తాను కోరుకుంటున్నానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముద్దనూరులో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వి దౌర్జన్యం చేసిన సంఘటన అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. దేవగుడి సోదరులు ఫ్యాక్షన్, రౌడీయిజం, అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. గతంలో వారు చేసిన రాజకీయాలు ఇప్పుడు చెల్లవని చెప్పారు. వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య చిచ్చుపెట్టే గుణంతో దేవగుడి సోదరులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తన మామ శశిధర్‌రెడ్డి తమతోనే ఉన్నారని, పార్టీ కండువా కూడా కప్పుకున్నారని, టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

సివిల్ సప్లయ్ డైరెక్టర్‌గా హాలు గంగాధరరెడ్డి కొనసాగింపు



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న హాలు గంగాధరరెడ్డి

పులివెందుల రూరల్ : సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పులివెందులకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హాలు గంగాధరరెడ్డి రెండవ సారి నియమితులయ్యారు. బుధవారం విజయవాడలోని సివిల్ సప్లయ్ రాష్ట్ర కార్యాలయంలో ఎండీ వీర పాండ్యన్ నుంచి నియామక ఉత్తర్వులను ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి రెండవ సారి రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటానని తెలిపారు.

తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ హరినారాయణరెడ్డి ఉద్యోగ విరమణ



కడప కార్పొరేషన్ : తెలుగు గంగ ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజినీర్ హరినారాయణరెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. 1985వ సంవత్సరంలో టీటీడీ సాంకేతిక విభాగంలో అసిస్టెంట్ ఇంజినీరుగా ఉద్యోగంలో చేరిన ఆయన, 1988లో జలవనరుల శాఖలో ఏఈగా ప్రస్థానం ప్రారంభించారు. 21 సంవత్సరాల తర్వాత డీఈగా పదోన్నతి పొందారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ పరిధిలోని సొరంగాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. 2018లో ఈఈగా, 2019లో ఎస్‌ఈగా పదోన్నతి పొందారు. 2020లో తెలుగుగంగ ప్రాజెక్ట్స్, తిరుపతి చీఫ్ ఇంజినీరు(ఎఫ్‌ఏసీ)గా నియమితులయ్యారు. ఎస్‌ఎస్‌ఆర్, ఎంజీఆర్ సంగం బ్యారేజీలను సకాలంలో పూర్తి చేసేందుకు విశేషంగా కృషి చేశారు. చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా 2020లో సోమశిల జలాశయంలో 78 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేశారు. కండలేరు జలాశయంలో 60 టీఎంసీలు నిల్వ చేసేందుకు కృషి చేశారు. ఉద్యోగ విరమణ చేసిన హరినారాయణరెడ్డికి అధికారులు, సిబ్బంది గురువారం వీడ్కోలు సభ నిర్వహించనున్నారు.

హత్యాయత్నం కేసులో యువకుడి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరం సాయిపేటలోని ఏ-1 నగర్‌లో గత నెల 27న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై కత్తితో దాడిచేసిన కేసులో షేక్ ఆర్ఫిద్‌ను అరెస్ట్ చేసినట్లు కడప టూటౌన్ సీఐ తబ్‌రేజ్ తెలిపారు. నిందితుడు షేక్ ఆర్ఫిద్ జులాయిగా తిరుగుతూ అందరినీ బెదిరిస్తూ ఉండేవాడు. ఈక్రమంలో గత నెల 24న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి, బుధవారం అరెస్ట్ చేశామన్నారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

48 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ వెంకట రమణ

వల్లూరు : మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో బుధవారం 48 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ : కురబలకోట మండలం గోల్డ్ స్వ్యాలీ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన మోహన్(20), మునిరత్నం(20)లు ద్విచక్ర వాహనంలో సొంతపనుల నిమిత్తం బి.కొత్తకోటకు వెళ్లి తిరిగి వస్తుండగా గోల్డ్‌స్వ్యాలీ కాలేజీ వద్ద బొలేరో ఢీ కొంది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ గాయపడ్డారు. 108 సిబ్బంది వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఒంటిమిట్టలో భారీ అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యం, నిందితులతో ఎస్‌ఐ మధుసూదన్ రావు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచపల్లెలో మంగళవారం రాత్రి భారీగా మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు బుధవారం ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు కచ్చితమైన సమాచారం మేరకు రాచపల్లిలోని మౌలాస్వామి దర్గా వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుంకేసుల గంగాధర్ (29), సుంకేసుల గంగయ్య (33)లను అదుపులోకి తీసుకొని వారివద్ద ఉన్న 151 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాజంపేట : రాజంపేట పట్టణం పాతబస్టాండు రోడ్డులోని శివాలయం క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణానాయక్ అలియాస్ చిన్న(35) అనే యువకుడు దుర్మరణం చెందాడు. అనంతపురం జిల్లా గుత్తిబాట తండా గ్రామానికి చెందిన కృష్ణనాయక్, తన తండ్రి భీమానాయక్‌తో కలిసి జీవనోపాధికి కూలిపనులు చేసుకునేందుకు రాజంపేటకు వలస వచ్చారు. కృష్ణానాయక్ బైకుపై అమ్మవారిశాల మలుపు నుంచి పాతబస్టాండుకు వస్తుండగా ఎదురుగా స్కూలు వ్యాను వస్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ధర్నాకు దిగిన గుత్తి కూలీలు..

కృష్ణానాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని గుత్తికి చెందిన కూలీలు ధర్నాకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న మృతుని సంబంధీకులు బోరున విలపిస్తూ రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. పట్టణ సీఐ మద్దయ్య ఆచారి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కూలీలు పట్టణ పోలీసు స్టేషన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

ముగిసిన అంతర్ పాఠశాలల పోటీలు



ప్రతిభ చూపిన ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో యూఎస్‌ఓ ప్రతినిధులు, తదితరులు



శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యాధరి పాఠశాల విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల (వైఎస్‌ఆర్‌ఆర్) ఆవరణంలో జనవరి 30, 31 తేదీలలో ఐకరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(యూఎస్‌ఓ) న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాయలసీమ స్థాయి అంతర్ పాఠశాలల పోటీలు బుధవారం ముగిశాయి. నృత్యం, ఇంగ్లీషు డ్రామా, ఇంగ్లీషు వక్తృత్వం, సైన్స్ ప్రాజెక్టు, స్పాట్ పెయింటింగ్ పోటీలలో కడప, అనంతపురం, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, రాయచోటి, తాడిపత్రి, వేంపల్లె పట్టణాల నుంచి 23 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పులివెందుల, వేంపల్లె, రాయచోటి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. అనంతరం శ్రీవిద్యాధరి పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యూఎస్‌ఓ సెక్రటరీ జనరల్ శ్రీమతి నీనా జైన్, జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అమల్ రాజ్, యూఎస్‌ఓ ఎగ్జిక్యూటివ్ మెంబర్, శ్రీవిద్యాధరి పాఠశాల సీఈఓ భానుప్రకాష్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలో ఫీజులు ఉండేలా చూడాలి



అకడమిక్ బ్లాక్-1 వద్ద ఆందోళన చేస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వేంపల్లె : వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు 2020 నుంచి తమకు పెంచిన ఫీజులు చెల్లించలేమని.. పాత పద్ధతిలో ఫీజులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం క్యాంపస్‌లోని అకడమిక్ బ్లాక్-1 వద్ద ఈ3, ఈ4 విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి ట్రిపుల్ ఐటీలలో చదివే విద్యార్థులకు అధికంగా పెంచిన ఫీజులు చెల్లించలేమని తెలిపారు. విద్యార్థులకు గతంలో రూ.40వేలు ఉండేదని.. దాన్ని ట్రిపుల్ ఐటీ అధికారులు రూ.50వేలకు పెంచారన్నారు. కావున పాత పద్ధతిలోనే ఫీజులు చెల్లిస్తామని విద్యార్థులు కోరారు. ఈ నేపథ్యంలో ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా స్పందిస్తూ ప్రస్తుతం ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5వేలు ఇస్తోందన్నారు. కాబట్టి విద్యార్థులకు ఫీజులు కూడా రూ.50వేలకు పెంచామన్నారు. 2020 కన్నా ముందు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఎక్కువ ఇస్తోందని చెప్పారు. దీంతో స్కాలర్ షిప్ వారికి, నాన్ స్కాలర్ షిప్ వారికి తేడా కనిపిస్తుందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారంలోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

జిల్లా అదనపు ఎస్పీగా లోసారి సుధాకర్

- ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ బదిలీ
- ఎస్‌ఈబీ అదనపు ఎస్పీగా జి. వెంకటరాముడు నియామకం



అదనపు ఎస్పీ అడ్మిన్‌గా నియమితులైన లోసారి సుధాకర్



ఎస్‌ఈబీ అదనపు ఎస్పీగా నియమితులైన జి. వెంకటరాముడు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలో అదనపు ఎస్పీలుగా పనిచేస్తున్న 21 మందిని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న లోసారి సుధాకర్‌ను వైఎస్‌ఆర్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు. రెండురోజుల క్రితమే ఇక్కడ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి తుషార్ డూడీని గుంటూరు ఎస్పీగా బదిలీ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో అదనపు ఎస్పీ (అడ్మిన్)గా లోసారి సుధాకర్‌ను నియమించారు. మరో వైపు వైఎస్‌ఆర్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) అదనపు ఎస్పీగా పనిచేస్తున్న కె.. ప్రవీణ్ కుమార్‌ను నంద్యాల జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు. ఇప్పటివరకు నంద్యాల జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తున్న జి. వెంకటరాముడును వైఎస్‌ఆర్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబి) అదనపు ఎస్పీగా బదిలీ చేశారు.